www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 11 అక్టోబర్ 2025

5

కాకినాడ



ఆదిత్య ప్రొఫెసర్ అనిల్‌కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అక్కల అనిల్ కుమార్‌కు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్టు ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ రవి తంగజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా విశ్వ విద్యాలయంలో అనిల్ కుమార్ సమర్పించిన గ్రంథానికి డాక్టరేట్ అందుకున్నారని తెలిపారు. ఆదిత్య ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ రవి తంగజన్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ డీన్ డాక్టర్ బి.సౌజన్య పాల్గొన్నారు.

గురువులపై గుదిబండ

- బోధనేతర పనులతో సతమతం
- పెరుగుతున్న పని ఒత్తిడి
- బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యా రంగంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులను బోధన పనులకే పరిమితం చేయాలి. దానివల్ల విద్యార్థులకు సంపూర్ణంగా పాఠ్యాంశాలు బోధించేందుకు అవకాశం ఏర్పడుతుంది. గత ప్రభుత్వం మాదిరిగా కూటమి సర్కారు సైతం యాప్‌ల పని భారాన్ని టీచర్లపై మరింత పెంచింది. దీంతో విద్యలో నాణ్యతా ప్రమాణాలు మరింత దిగజారడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలోనే ఉపాధ్యాయ సంఘాలన్నీ కలిసి బోధనేతర పనులను వద్దని వారిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఎపి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి బోధనేతర పనులను బహిష్కరించి నిరసన తెలియజేస్తున్నారు. ఇప్పటికే ఆయా జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల అధికారులకు వినతిపత్రాలను అందించారు. పాఠాలు చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని, బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధన, 12వ పిఆర్‌సి మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సిపిఎస్ రద్దు, మెమో 57 అమలు, పెండింగ్ బకాయిలు తదితర డిమాండ్ల సాధనకై ఈ నెల 7న విజయవాడ ధర్నాచౌక్ లో రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.

కాకినాడ జిల్లాలో 1,876 ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా ఒకటి నుంచి 10వ తరగతి 2,89,634 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 6,928 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి బోధనేతర పనులను తప్పించి విద్యార్థులకు పూర్తిగా పాఠ్యాంశాలను బోధించే పనిని మాత్రమే అప్పగించాలని ఉపాధ్యాయులు కోరుకున్నారు.



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

విద్యావ్యవస్థను బలహీనపరిచేలా..

కూటమి ఏర్పడి 16 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్యకూ చెప్పుకోదగ్గ పరిష్కారం లభించలేదు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వమే విద్యా వ్యవస్థను బలహీన పరచిందని టీచర్ల సంఘాలు తీవ్ర స్థాయిలో ఆరోపిస్తున్నాయి. తాత్కాలిక నియామకాలే తప్ప శాశ్వత నియామకాలు లేని వ్యవస్థగా పర్యవేక్షణా వ్యవస్థ తయారైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాహక్కు చట్టం, ప్రపంచ బ్యాంక్ సాల్ట్ పథకం అమలు పేరుతో 3వ వంతు ప్రైమరీ స్కూళ్లు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారిపోయాయి. సగంపైన హైస్కూళ్లు సింగిల్ సబ్జెక్టు టీచరు స్కూళ్లుగా తయారయ్యాయి. హైస్కూళ్లలో పని చేయాల్సిన స్కూలు అసిస్టెంట్లు సర్స్ పేరుతో క్లస్టరు టీచర్లుగా, ప్రైమరీ స్కూలు హెడ్మాస్టర్లుగా పనిచేయాల్సిన పరిస్థితులు కల్పించారు. ఇలా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

హరించుకుపోతున్న బోధన సమయం

మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల బోధనా సమయం హరించుకుపోతోంది. ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని సంఘాలన్నీ గగ్గోలు పెడుతున్నాయి. పలు దఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా, ఏమాత్రం పట్టించుకోనందున ఈ నెల 7న విజయవాడ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకంకు సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడుతారని, మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప, ఏ ఇతర బోధనేతర పనులను గానీ అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జిఎస్‌టి 2.0 లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలు చేపట్టబోమని అధికారులకు ఇచ్చిన నోటీసులో తెలిపారు.



బోధనకే పరిమితం చేయాలి

ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే చెప్పే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. టీచర్లకు సంబంధం లేని బోధనేతర పనులు చెప్పడం వల్ల విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించేందుకు సమయం సరిపోవడం లేదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి తక్షణమే స్పందించాలి.

- సిహెచ్.సూరిబాబు, ఫ్యాప్టో సెక్రటరీ జనరల్, యుటిఎఫ్ జిల్లా నాయకులు.



ఏకీకృత సర్వీసు సమస్య పరిష్కరించాలి

ఏకీకత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించడంతో బాటు విద్యా శాఖలో సంవత్సరాల తరబడి ఉన్న అసంబద్ధాన్ని తొలగించాలి. వీటిపై పదేపదే ప్రభుత్వానికి విన్నవిస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. బోధనేతర పనుల వల్ల ప్రభుత్వ విద్యా ప్రమాణాలు పడిపోతున్నా మొండి వైఖరి వీడడం లేదు.

- కెవివి. నగేష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.



సమస్యలపై ఉద్యమ కార్యాచరణ

ఏళ్ల తరబడి ఉపాధ్యాయులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఏ ప్రభుత్వం మారినా టీచర్ల సమస్యలు అసంబద్ధంగానే ఉంటున్నాయి. సిపిఎస్ రద్దు, బోధనేతర పనులు, ఖాళీల భర్తీ, వేతన సవరణ సంఘం ఏర్పాటు ఇలా అనేక సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయి. అందుకే ఉద్యమ కార్యాచరణకు దిగాము. ఈ నెల 7 పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాం. బోధనేతర పనులను బహిష్కరించాం.

- టి.చక్రవర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై విస్తత అవగాహన కల్పించి మరింత మందికి లబ్ధి చేకూరే విధంగా అధికారులు కృషి చేయాలని కాకినాడ ఎంపీ, దిశ (జిల్లా అభివద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) చైర్మన్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, దిశ మెంబర్ సెక్రటరీ షాన్ మోహన్ సగిలి, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ట్రైనీ కలెక్టర్ మనీషా, వివిధ మండలాల ఎంపిపిలు, దిశ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరు, సమన్వయం, పర్యవేక్షణకు దిశ కమిటీని ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సభకు వివరించారు. అనంతరం నిర్దేశించిన ఎజెండాలోని ప్రధానాంశాలపై సమీక్షించారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వివిధ పరిశ్రమల్లో పని చేయడానికి ఏయే స్కిల్స్ ఉన్నవారు ఎంతమంది అవసరమో వివరాల సేకరించి 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ కాకినాడ జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ శ్రీనివాస్

దిశ కమిటీ సమావేశం ద్వారా జిల్లా అభివద్ధికి కషి చేయాలని గౌరవ దిశ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులకు సూచించారు. కమిటీ చైర్ పర్సన్, సభ్యులు సూచించిన అంశాలపై అధికారులు మరింత దష్టి పెట్టి, మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అభివద్ధికి ఒక ప్రత్యేకమైన ప్రణాళికను రూపొందించి ప్రతిపాదనలు ప్రభుత్వంకు పంపిస్తామని జిల్లా కలెక్టర్ ఎంపీకి వివరించారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, ఎఒ ఎం.బుజ్జిబాబు, దిశ సభ్యులు నందమూరి వినోద్, దోమాదుల స్వాతి లక్ష్మి, సోనీ ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

సమన్వయంతో సారా నిర్మూలన

ప్రజాశక్తి-కాకినాడ

నాటు సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద హాల్లో ఎస్‌పి బిందు మాధవ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ట్రైనీ కలెక్టర్ మనీషా, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రేణుకతో కలిసి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి నవోదయం (నాటుసారా నిర్మూలన),పై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి మాట్లాడుతూ రాష్ట్రాన్ని సారా రహితంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. సారా తయారీ, విక్రయాలతో జీవనం సాగించేవారు ఇకపై ఆ పనులు మానుకోవాలని సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. సారా తయారీ, రవాణా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

విక్రయాలు కొనసాగించే వారిపై ఇకపై కఠిన చర్యలు ఉంటాయని, తెలిపారు ఎక్కడైనా సారా తయారు చేసినా, రవాణా చేసినా, నిల్వ చేసినా, అమ్మకాలు జరిపినా 14405 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, జిలా ఎక్సైజ్ సూపరిండెంట్ ఎం.కృష్ణకుమారి పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థినికి ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-శంఖవరం

మండల కేంద్రమైన శంఖవరంలో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థినికి ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ సందర్భంగా ప్రశంసాపత్రం, నగదు లభించింది. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 10వ తరగతి చదువుతున్న పెద్దిరెడ్డి శరణ్యకు మూడో స్థానం లభించింది. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ విద్యార్థిని శరణ్యకు ప్రశంసాపత్రంతోపాటు మెమెంటో 2000 నగదు అందజేశారు. ఈ సందర్భంగా శరణ్యను పాఠశాల ప్రిన్సిపల్ బాలమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



స్కూల్ గేమ్స్‌లో కబడ్డీ ఆడుతున్న బాలికల జట్లు

విద్యార్థులకు క్రీడా స్ఫూర్తి ఉండాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ప్రతి విద్యార్థీ క్రీడా స్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలని ఎంఇఒ మోకా ఉమ, సామాజికవేత్త బొడ్డు సత్యనారాయణ అన్నారు. బొడ్డు చినవెంకటాయపాలెం హైస్కూల్లో ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాలికల ఆటల పోటీల ఎంపికలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలకు కోకో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఎంవి నాగేంద్ర తెలిపారు. మండలంలోని 18 పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు ఈ క్రీడలలో పాల్గొన్నారన్నారు. ఈ మండల స్థాయి క్రీడల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులు కాకినాడ డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని హెచ్ఎం సాయి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం సాయి ప్రసాద్, లక్ష్మీపతిపురం హైస్కూల్ హెచ్ఎం గోవిందరాజు, పీడీ లంకే చంద్రావతి, 15 మంది వ్యాయామ పాధ్యాయులు, హైస్కూల్ కమిటీ చైర్మన్ కొపనాతి దత్తాత్రేయ వర్మ, కోరంగి మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీనరసింహరాజు, సంగాడి శ్రీనివాసు, రేకాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం, కాకినాడ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు శుక్రవారం 13వ వార్డులో సంతకాల సేకరణను ప్రారంభించారు. ప్రతి ఇంటినీ సందర్శిస్తూ ప్రజలకు ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను వివరించారు. మెడికల్ విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, దాన్ని వ్యాపార రూపంలోకి మార్చడాన్ని అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొట్టిన పవన్ కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, గోకిన సునేత్రాదేవి, నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి జమీలు, వైసిపి నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, తలారి దొరబాబు, మేకా శ్రీనివాసరావు, తలారి దొరబాబు, సేపేని సురేష్, రెడ్డి లోవ కుమారి, పాలిక కుసుమ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ వైసిపి ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు ఇచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదేనని వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్థానిక రమణయ్యపేటలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టి 50 వేల సంతకాలు చేసిన కాగితాలను జిల్లాస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో అందిస్తామన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీ చేపట్టి వినతిపత్రాలిస్తామని తెలిపారు.కోటి సంతకాల పత్రాల సేకరణతో గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వైసిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, జెడ్‌పిటిసి నురుకుర్తి రామకృష్ణ, షేక్ కరీంబాషా, నాజ్ వలి, గురునాథం, బెజవాడ సత్యనారాయణ, అనసూరి ప్రభాకర్, నేమాం చిన్న, గోపిశెట్టి బాబ్జి, విజయ సారధి, నల్లరాణి, పుల్ల కోటి, జాన్ ప్రభాకర్, కర్రి చక్రి, నాగబాబు, కొత్తపల్లి గిరీష్ పాల్గొన్నారు.

జగ్గంపేట కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను మాజీ మంత్రి, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తోట నరసింహం ఆవిష్కరించారు. గండేపల్లి ఎంపిపి చలగళ్ళ దొరబాబు, పార్టీ బూత్ కమిటీల జిల్లా కన్వీనర్ ఒమ్మి రఘురామ్, పార్టీ నాయకులు రామకుర్తి జాగాలు, మూర్తి, కరుటూరి వీర్రాజు, వరుపుల సూరిబాబు, రావుల గణేష్ రాజా పాల్గొన్నారు.



పెద్దాపురంలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు



కాకినాడ రూరల్‌లో సంతాకాల సేకరణను ప్రారంభిస్తున్న కన్నబాబు



నిరసన తెలుపుతున్న వైసిపి మహిళా నేతలు

కల్తీ మద్యంపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యంపై నిరసిస్తూ వైసిపి రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వంగా గీతవిశ్వనాథ్ ఆధ్వర్యంలో కాకినాడలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ వైసిపి అధినేత వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ మద్యానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందని, ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి మద్యం సమయ పాలన లేకుండా విక్రయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న సాగర్, రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైసిపి పార్టీ మహిళా నాయకులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ

ప్రజాశక్తి-రౌతులపూడి, జగ్గంపేట

ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన కార్యక్రమాలు తప్ప మిగతా బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తామని యుటిఎఫ్ రౌతులపూడి మండల అధ్యక్షుడు కొరుప్రోలు హరిబాబు ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారి గాడి కొండబాబుకు వినతిపత్రం అందజేశారు. పలు దఫాలుగా ప్రభుత్వానికి తాము వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ నెల 7న విజయవాడలో ధర్నా చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, నాగరాజు పాల్గొన్నారు.

జగ్గంపేట యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవి.సాయిరాం, కార్యదర్శి పివివి.సత్యనారాయణ, మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో బోధనేతర పనులను బహిష్కరించాలని యూనియన్ నిర్ణయించినట్టు తెలిపారు.



రౌతులపూడిలో వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు



యంత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

అనుమతుల మేరకే బాణసంచా తయారీ

ప్రజాశక్తి- తాళ్లరేవు

అనుమతులు పొందిన మేరకే దీపావళి మందుగుండు సామగ్రి తయారు చేయాలని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. జి.వేమవరం రామాలయం పేటకు చెందిన శ్రీపార్వతీ పరమేశ్వర ఫైర్ వర్క్స్ యజమాని ఎర్రంనీడి ఆంజనేయులుకు ఆయన నోటీసు జారీ చేశారు. 15 కిలోల ఫైర్ వర్క్స్ మందుగుండు పౌడరుకు సంబంధించి అనుమతులు ఉండగా దానికంటే ఎక్కువగా మందు గుండు సామగ్రి తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. మందుగుండు సామగ్రి తయారుచేసే కేంద్రంలో నైపుణ్యం కలిగిన వారిని మాత్రమే నియమించాలని, తయారు చేసిన మందుగుండు సామగ్రిని నిర్ధేశిత ప్రదేశంలోనే నిల్వ ఉంచాలన్నారు.

ముదునూరిని కలిసిన ఎంపీ బోస్

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ధర్మవరంలో వైసిపి నర్సాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజును రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ శుక్రవారం కలిశారు. మురళీరాజు తండ్రి రామరాజు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బోస్ తనయుడు, వైసిపి రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

పెద్దాపురం మండలంలోని పద్మనాభ కాలనీలోని బచ్చు ప్రభుత్వ హైస్కూల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్, విద్యాశాఖ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఆధ్వర్యంలో నిర్వహించారు. స్కూల్ హెచ్ఎం బిజె.రవీంద్ర అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి జి.ఉష, ఎస్ఐ వై.మౌనిక హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారి జి.ఉష మాట్లాడుతూ ఏటా అక్టోబర్ 11న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం 'బాలికగా నాతోనే మార్పు-రండి ముందుకు' అనే అంశంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బాలికలపై లింగ అసమానతలు, బాల్యవివాహాలు, హింస, చట్టపరమైన హక్కులు, విద్య, వైద్య సంరక్షణ వంటి అంశాలపై చైతన్యం కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 2012లో మొదటిసారిగా ఈ దినోత్సవం జరుపుకున్నట్టు అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానర్ రూజ్‌వెల్ట్ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 11న ఐక్యరాజ్యసమితి దీనిని ప్రకటించినట్లు వివరించారు. ఎస్ఐ వి.మౌనిక మాట్లాడుతూ విద్యార్థినులు తమ జీవితానికి లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని, వ్యామోహాలకు దూరంగా ఉండాలని సూచించారు. 'బాలికను రక్షిద్దాం బాలికను చదివిద్దాం' అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు బాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, బాల్యవివాహాలు లేదా లైంగిక వేధింపులపై సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా పోలీసు 112కి ఫిర్యాదు చేయాలని సూచించారు. చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు చంద్రకళ, మంగ, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బి.లక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సామర్లకోట ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఎంఇఒలు వై.శివరామకృష్ణ, పి.పుల్లయ్య, ఐసిడియస్ సూపర్‌వైజర్లు ఉమాదేవి, నళిని, బిబి.నిర్మల, బి.శ్రీనివాసరావు, అనూష, బి.లక్ష్మి, అచ్చిబాబు పాల్గొన్నారు.



పెద్దాపురంలో బాలికా దినోత్సవ సభ



సామర్లకోటలో మాట్లాడుతున్న ప్రతినిధులు

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆర్థిక బాధలు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు గత నెల చివరి వారంలో తేతలి గ్రామానికి చెందిన గంటా గౌతమ్ కుమార్(27) పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని రాజానగరం జిఎస్-ఎల్ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. అతనికి భార్య, తొమ్మిది నెలల చిన్నారి ఉన్నారు. ఈ మనరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కలుపు మందు తాగిన మహిళ మృతి

ప్రజాశక్తి - పెరవలి

కలుపు మందు తాగిన మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన వీరవల్లి వెంకట దుర్గ కళ్యాణి లక్ష్మి(25) మృతి చెందింది. ఆమె ఈ నెల 5న కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను తణుకులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆమె చికిత్స పొందుతుంది. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

దారి దోపిడీ కేసులో రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

ఆగస్టు 12న రామచంద్రపురం ఎటుగట్టుపై జరిగిన దారిదోపిడీ కేసులో ఇద్దరు నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. ఆగస్టు 12న రామచంద్రపురం గ్రామానికి చెందిన చెవల సుబ్బారావు తన రెండో కుమార్తె వివాహం నిమిత్తం సీతానగరం వెళ్తున్నాడు. గుర్తు తెలియని ఇద్దరు దుండగులు సీనీఫక్కీలో బండి నుంచి కింద పడిపోతున్నట్లు నటించారు. సుబ్బారావు పడిపోతున్న వాహనాన్ని పైకి లేవదీస్తుండగా దుండగులు సుబ్బారావు చొక్కా జేబులో రూ.20వేలను అపహరించారు. దీనిపై బాధితుడు పోలీసులకు పిర్యాదు చేశాడు. విచారణలో గోకవరం గ్రామానికి చెందిన మేకల రాము, నరుకుర్తి రాజులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15,600 రికవరీ చేశారు. శుక్రవారం నిందితులను కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి పద్నాలుగు రోజులు రిమాండ్ విధించినట్లు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

అట్రాసిటీ కేసు కొట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరులో జరిగిన ఘటనలో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో 32 మందిపై పెట్టిన అభియోగం రుజువు కాకపోవడంతో శుక్రవారం కేసును కొట్టివేస్తూ రాజమహేంద్రవరం ఎస్‌సి, ఎస్‌టి కోర్టు న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే 2017 అక్టోబర్ నెలలో ఆలమూరు మండలం గుమ్మిలేరులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో రెండు గ్రూపులు మధ్య వివాదం ఏర్పడింది. దీంతో వారు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో అప్పటి ఎస్ఐ ఎం.శేఖర్ బాబు విచారణ చేసి రెండు వర్గాలపై కేసు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఆరు నెలల క్రితమే ఒక గ్రూపునకు చెందిన కేసును కొట్టి వేశారు. మరో కేసులో గుమ్మిలేరుకు చెందిన 38 మందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిలో ఆరుగురు అనివార్య కారణాలతో మృతి చెందడంతో ఈ కేసులో 32 మంది మిగిలారు. గత ఎనిమిది సంవత్సరాలుగా వాయిదాలు జరుగుతూ ఉండగా శుక్రవారం పూర్తి విచారణ అనంతరం 32మందిపై పెట్టిన అభియోగం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ రాజమహేంద్రవరం ఎస్‌సి, ఎస్‌టి కోర్టు న్యాయమూర్తి సాయి సునంద తీర్పు వెల్లడించినట్లు ఈ కేసులో న్యాయవాదులుగా ఉన్న ఎస్ఎస్.ప్రకాష్ రావు, నామన సీతారాంలు విలేకరులకు తెలిపారు.

ఆత్మహత్య కేసులో ఇద్దరికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మునికూడలికి చెందిన మురాల అనిల్‌దేవ ఆత్మహత్య కేసులో ఇద్దరికి రిమాండ్ విధించారని సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. మునికూడలికి చెందిన మురాల అనిల్ దేవ ఉరి వేసుకొని చనిపోయాడు. దీనిపై దేవ అమ్మమ్మ సుభద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గత నెల 29న కేసు నమోదు చేశారు. ఈ నెల 3న కుటుంబ సభ్యుల సమక్షంలో శవ పరీక్ష నిర్వహించారు. యువకుని మృతిలో నిందితులు బొబ్బిలిలంకకు చెందిన కప్పల సతీష్, రాజమండ్రికి చెందిన కాలుకురాస వరుణ్ అలియాస్ చిన్నగా గుర్తించి అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి- గోకవరం

స్కూటీపై గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేవారు. సిఐ సత్యకిశోర్ తెలిపిన వివరాల మేరకు రాజమహేంద్రవరానికి చెందిన చింతల మురారీ, సూరి హేమంత్, దూలపల్లి నాని ఏజెన్సీ ప్రాంతం నుంచి స్కూటీపై గోకవరం మీదుగా రాజమహేంద్రవరంకు గంజాయిని తరలిస్తున్నారు. గోకవరం ఠాణా సెంటర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. స్కూటీపై వెళ్తున్న వీరిని ఆపి తనికీలు నిర్వహించగా 11 కేజీల గంజాయిని గుర్తించారు. గంజాయితో పాటూ రెండు సెల్ ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. మత్తుపదార్థాల రవాణా, విక్రయం, వాడకం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ తనిఖీల్లో గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయిని తరలిస్తున్న నిందితులు

యానాం వార్తలు



2కె రన్‌ను ప్రారంభిస్తున్న మల్లాడి, పరిపాలనాధికారి అంకిత్ కుమార్

బాలికల దినోత్సవం సందర్భంగా 2కె రన్..

ప్రజాశక్తి - యానాం

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో శుక్రవారం బాలికలకు 2కె రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, యానాం పరిపాలనాధికారి అంకిత్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో అభివద్ధి సాధిస్తారన్నారు. యానాం జనాభాలో ఓటర్లలో మహిళలలే ఎక్కువగా ఉన్నారన్నారు. 2కె రన్‌ను పరిపాలనాధికారితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి, మరో 15 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న వంద మంది విద్యార్థినులకు మల్లాడి కృష్ణారావు ప్రత్యేక ప్రోత్సాహంగా ఒక్కొక్కరికీ రూ.వంద చొప్పున పదివేలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతపై అవగాహన కల్పించడం, సమాజంపై దాని ప్రభావాన్ని ప్రదర్శించడం లక్ష్యంగా నిర్వహిచడం జరిగిందని, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ శక్తి,పట్టుదలను చూపించారన్నారు.



ఆర్ఎఒ అంకిత్ కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న మనోజ్ కుమార్

నివాసాలు లేని చోట బాణసంచా దుకాణాలు

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ పరిధిలో విచ్చలవిడిగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని వాటిపై అధికారులు దష్టి పెట్టాలని రామ్‌జీ సక్సాల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్ఎఒ అంకిత్ కుమార్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. పాఠశాలలు, పెట్రోల్ బంకులు, నివాసాల మధ్య బాణసంచా దుకాణాలకు సంబంధించిన లైసెన్స్‌లు ఇవ్వొద్దని వారు కోరారు. విశాలమైన ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ దుగ్గుదుర్తి మనోజ్ కుమార్,ట్రెజరర్ యాళ్ళ జీవన ప్రభాకర్,జాయింట్ సెక్రెటరీ పోతుల జయదీప్,చిన్న,నాని తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు సాయి ఎంపిక

ప్రజాశక్తి - యానాం

ఇండోర్ మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన 14వ మోడరన్ పెంథాలన్ బైథిన్ నేషనల్ ఛాంపియన్షిప్ - 2025 స్విమ్మింగ్ పోటీలలో శాయ్ క్రీడాకారుడు వీసం వెంకట నాగ సాయి మూడవ స్థానంలో నిలిచాడని సెంటర్ ఇంచార్జ్ ఎన్ ఉదయ్ కుమార్ శుక్రవారం పకటనలో తెలిపారు. వెంకట నాగ సాయి డిసెంబర్ 8 నుండి 13 వరకు మొసల్ బె సౌత్ ఆఫ్రికాలో నిర్వహించబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా కోచ్ గ్రంధి రవితేజను అభినందించారు.

జిఎస్‌టి ఎగ్జిబిషన్ స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జిఎస్‌టి సంస్కరణలతో సామాన్య ప్రజలకు మేలు కలుగుతుందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కమర్షియల్ టాక్స్ కెవి.లక్ష్మీ ప్రసన్న, అసిస్టెంట్ కమిషనర్ నిర్వహించిన సేవింగ్స్ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఎంఎల్ఎ ప్రారంభించారు. ప్రజలకు చేకూరే ప్రయోజనాల గురించి అధికారులను, అడిగి తెలుసుకున్నారు. కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, నండ్ల చిరంజీవి, ఎసిటిఒ రాజా, ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.పూర్ణిమ, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఎఇఒ టివి.శివరామారావు, ఎపిఒ రమణ కుమార్, పంచాయితీ కార్యదర్శి శివ, శ్రీను, బత్తిన మోహన్ ధర్మేంద్ర పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించే పనులకు గ్రామసభ నిర్వహించారు. శుక్రవారం ఎకె.మల్లవరం, ఎపి.మల్లవరం గ్రామాల్లో 2026 -27 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించే పనులకు గ్రామసభ ఏర్పాటు చేసి ఉపాధి పథకంలో చేపట్టే అభివృద్ధి పనులు, వ్యక్తిగత అభివృద్ధి పనులు, కమ్యూనిటీ అభివృద్ధి పనులు, సంస్థాగత అభివృద్ధి పనులు, సహజ వనరులకు సంబంధించిన పనులను గుర్తించారు. ఈ సందర్భంగా ఎపిఒ గంగాభవాని మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్‌కు సంబంధించి విధివిధానాలను వివరించారు. ఉపాధి హామీ కూలీలు అందరూ ఇకెవైసి చేయించుకోవాలని, ప్రతి ఒక్కరూ ఇకెవైసి అప్‌డేట్ అయినప్పుడు మాత్రమే పనికి హాజరయ్యేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అరిగెల సత్యనారాయణమ్మ, కె.సుశీల పాల్గొన్నారు

భీమేశ్వరుని హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట శ్రీకుమార రామ భీమేశ్వరాలయ హుండీల ఆదాయం రూ.19,96,390 వచ్చింది. మార్చి 21 నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు 199 రోజులకు గాను హుండీల ఆధాయాన్ని శుక్రవారం లెక్కించారు. దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ఫణి కుమార్ ఆధ్వర్యంలో ఆదాయ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రూ.19,96,390 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చీమలకొండ వీరభద్రప్రసాదరావు, తాతపూడి సత్య అరుణ వంశీ, గొల్తి సత్యనారాయణ, తాతపూడి పవన్ కుమార్, కంచర్ల సుష్మ మోహిని, మందపల్లి భాను వెంకట పద్మ, బాడితిమాని లక్ష్మి పాల్గొన్నారు.

లారీ స్టాండ్‌లో మహా అన్నదానం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట లారీ స్టాండ్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం మహా అన్నదానం నిర్వహించారు. యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ అన్నదానం నిర్వహించారు. పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నదానం ప్రారంభించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కొనసాగిన అన్నదాన కార్యక్రమంలో వేల సంఖ్యలో పాల్గొని భోజనాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ నాయకులు, ఓనర్‌లు, వర్కర్‌లు పాల్గొని సేవలనందించారు.

జిఎస్‌టి తగ్గింపుతో పేదలకు ఊరట

ప్రజాశక్తి- తాళ్లరేవు



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టి వల్ల వస్తువుల ధరలు తగ్గి పేదలకు మేలు జరుగుతుందని ముమ్మిడివరం ఎంఎల్ఎ ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు అన్నారు. జిఎస్‌టి తగ్గింపు సందర్భంగా సీతారామపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. జిఎస్‌టి తగ్గించిన తరువాత వివిధ వస్తువుల ధరలలో వ్యత్యాసాలను తెలిసేలా ఈ ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన మహిళలతో ఎంఎల్ఎ మాట్లాడారు. ప్రభుత్వం తగ్గించిన ధరల వివరాలు తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఎంపిడిఒ లక్ష్మణరావు, ఎఒ సత్యనారాయణ నాయకులు ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, వేగేశ్న భాస్కర రాజు, పొన్నమండ రామలక్ష్మి, కొప్పిశెట్టి బాబి, వెంటపల్లి ఉమామహేశ్వరి, కొప్పిశెట్టి చంటి పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌లో వేట్లపాలెం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - సామర్లకోట



క్రీడాకారులను అభినందిస్తున్న సిబ్బంది

మండల స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం, శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలలో వేట్లపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో అండర్ 14 వయస్సు గుంపులో వాలీబాల్‌లో మొదటి స్థానం, కబడ్డీలో రెండో స్థానం సాధించారు. అండర్ 17 బాలుర విభాగంలో వాలీబాల్, ఖోఖో క్రీడల్లో మొదటి స్థానాలు దక్కించుకున్నారు. బాలికల విభాగంలో అండర్ 14లో వాలీబాల్‌లో మొదటి స్థానం, అండర్ 17 విభాగంలో కబడ్డీ, వాలీబాల్ రెండు క్రీడల్లోనూ మొదటి స్థానాలు సాధించారు. విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం పి.అనురాధ, విద్యా కమిటీ చైర్మన్ పి.నాగశివ, గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరాం, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మాజీ ఎంపిపి కొండపల్లి కృష్ణమూర్తి, గుమ్మళ్ల రామకృష్ణ, నున్న వెంకటరాజు, తదితరులు అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీలు యార్లగడ్డ బంగారాజు, ఎం.ఇబ్రహీం, శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మానసిక ఆరోగ్య వారోత్సవాల ముగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం



నవోదయలో ముగింపు సభ

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 4 నుంచి 10 వరకూ నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ వారోత్సవాలను ప్రిన్సిపల్ సీతాలక్ష్మి పర్యవేక్షణలో కౌన్సిలర్లు నగేష్, కష్ణవేణి మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, మానసిక సమస్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులలో సజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో పోస్టర్ మేకింగ్, స్పాట్ డిబేట్, ఉద్వేగాల ప్రదర్శన వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, స్టాఫ్ నర్స్ బాయమ్మ, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, చక్రవర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

క్రీడల్లో మున్సిపల్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట



విజేతలను అభినందిస్తున్న సిబ్బంది

స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు మండల స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామ కష్ణ పేర్కొన్నారు. అండర్ 17 ఖోఖో బాలురు డి.రంజిత్, అంజిరెడ్డి, రాకేష్, బాలికల విభాగంలో పి.తులసి, అండర్ 14లో గౌతం, కామేష్, చైతన్య బాలుర విభాగంలో, బాలికల విభాగంలో జి.వర్షిణి, ఎస్.రుక్మిణి, పి.జ్యోత్స్నష్ణ, ఎస్.సత్యవాణి ఎంపికయ్యారు. కబడ్డీ అండర్ 17 బాలుర విభాగంలో కె.అభిరామ్, సిహెచ్.కార్తీక రెడ్డి, కె.ప్రవీణ్ కుమార్ ఎంపిక కాగా 200 మీటర్ల రన్నింగ్‌లో గౌతం ఎంపికైనట్టు హెచ్‌ఎం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, పీడీ పి.సుధారాణిని హెచ్‌ఎం సాయి రామకృష్ణ, ఎస్ఎంసి చైర్మన్ అక్కిన చక్రధర్, స్టాఫ్ అభినందించారు.

ఘనంగా మానసిక ఆరోగ్య దినోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని బేతస్థ న్యూ లైఫ్ హాస్టల్లో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయమూర్తి సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, చైర్మన్ మండల లీగల్ సర్వీస్ అథారిటీ వారి ఆదేశాలతో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయ అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. 1992లో 150 దేశాలు ఏకమై ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం స్వచ్ఛంద సంస్థల ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారని అన్నారు. అక్టోబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నారని అన్నారు. పలు న్యాయపరమైన విషయాలను తెలిపారు. బెతస్ట న్యూ లైఫ్ సెంటర్ హాస్టల్ నందు బార్‌అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కె.ప్యానల్ అడ్వకేట్ దోమలపాటి. సత్యనారాయణ మాట్లాడారు. న్యూలైఫ్ సెంటర్ చైర్మన్ అలగ్జాండర్, సతీమణి ఫ్లెక్సీయా పాల్గొన్నారు . మానసిక వికలాంగులకు, పిల్లలకు బిస్కెట్స్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. **రాజోలు:** పపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని రాజోలు వివేకానంద మనోవికాస కేంద్రంలో శుక్రవారం రాజోలు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. పానల్ లాయర్ జెహెచ్.సాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, అవి ప్రజల జీవితాలపై చూపించే ప్రభా వాలు, మానసిక రోగుల పరిరక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మనో వికాస కేంద్రం నిర్వాహకురాలు మటపర్తి లక్ష్మీ, పారాలీగల్ వాలంటీర్లు ఎస్.మహాలక్ష్మి, కె.సురేంద్ర కుమార్, హైమావతి, కోర్టు సిబ్బంది మూర్తి తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** ప్రతీ ఒక్కరూ మానసిక ఒత్తిడి లేని జీవన విధానం అలవర్చుకోవాలని మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి ఆవరణలో ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ కౌశిక్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సదస్సులో బార్ ప్రెసిడెంట్ వడ్డీ నాగేశ్వర రావు, అడ్వకేట్స్ పివి.చక్రవర్తి, ప్యానల్ లాయర్స్ ఎండి ఆలీ హాసన్, ఆసుపత్రి సిబ్బంది రోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి - కొత్తపేట

ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యతని పలువురు అన్నారు. విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెపి.రాజు అధ్యక్షతన రెడ్ రిబ్బన్ క్లబ్ మరియు జువాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురానికిచెందిన జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జి.శ్రీనివాసులు ప్రాజెక్ట్ మేనేజర్ విచ్చేసి విద్యా ర్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ ను దేశవ్యాప్తంగా 2030 నాటికి నిర్మూలించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కె.సూర్యనారాయణ, సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ టి. రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసులు, బి.విజయ్‌కుమార్, పి.సాయికష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పనులకు నిధుల మంజూరుపై హర్షం

ప్రజాశక్తి-రౌతులపూడి

రౌతులపూడి-శంఖవరం రహదారి మరమ్మతుల పనులకు రూ.3.50 కోట్లు, బలరామపురం-ఎస్.అగ్రహారం రోడ్డు నిర్మాణ పనులకు రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేయించిన ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభకు టిడిపి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ములగపూడిలో టిడిపి మండల అధ్యక్షుడు తమరాన సత్యనారాయణ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, కత్తిపూడి బుచ్చి సీతయ్యమ్మ మహారాణి సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, సొసైటీ అధ్యక్షుడు పైలా పైడిరాజు, ఎంపిటిసి సోమరౌతు రవి ఆయా గ్రామాల టిడిపి అధ్యక్షులు పైల నాయుడు, గాడి రాంబాబు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన ఎస్‌బిఐ చైర్మన్ చల్లా

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవి రోహిత్ ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ శ్రీనివాస శెట్టి కుటుంబ సమేతంగా స్వామివారి వ్రతం ఆచరించారు. అనంతరం ఎస్‌బిఐ సామాజిక సేవల్లో భాగంగా యాత్రికుల రవాణా సదుపాయానికి ఉచితంగా రూ.30 లక్షల విలువైన 33 సీట్లు కెపాసిటీ గల బస్సును చైర్మన్ శ్రీనివాసులు శెట్టి ఇఒ సుబ్బారావు అందజేశారు.

దేవి సెంటర్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక దేవి సెంటర్ లలిత భువనేశ్వరి దేవి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని బాటసారులకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, వైబోగుల కొండబాబు, ఆలయ కమిటీ చైర్మన్ నాళం సూరిబాబు, తాండ్రోతు వెంకట రమణ, ఇమ్మెళ్ల రాంబాబు, విజయ ఎంటర్‌ప్రైజెస్ శ్రీను, ఇమ్మేళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

రామవరం రంగవల్లినగర్‌లో నిరుపేద కుటుంబాలకు 25 కేజీల బియ్యం ప్యాకెట్లను ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో పేదలు పూరి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ కాలనీకి తాగునీరు, రోడ్లు, స్కూలు, అంగన్‌వాడీ స్కూలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కుంచే అంజిబాబు, కె.సతీష్, దేవి, డాన్ శ్రీను, సోమరాజు, సత్తిబాబు, నాగు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని ఒక నిరుపేద కుటుంబం పరిస్థితిని గమనించిన పెద్దాపురం ఎస్ఐ వి.మౌనిక వారికి నిత్యావసర సరుకులు సాయం అందజేశారు. కుమ్మర వీధికి చెందిన ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో ఎస్ఐ మౌనిక ఈ సహాయాన్ని అందించారు. ఆమె వెంట స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్ఎ ప్రజా దర్బార్

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక నియోజకవర్గ టిడిపి కార్యాలయం వద్ద ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వెంటనే అధికారులకు ఫోన్ చేసి ఆ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్ అప్పలరాజు, నాయకుల పీలా మహేష్, పెనుమర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

ఆదిత్యలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయం యూత్ రెడ్ క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ శిబిరం బోధన, బోధనేతర సిబ్బంది ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గ్రంధి సత్య ప్రశాంత్ పాల్గొనిసిబ్బందికి వ్యక్తిగత ఆరోగ్య సలహాలు, ఆయుర్వేద పద్ధతిలో జీవనశైలి మార్పులు, ఆరోగ్య పరిరక్షణ మార్గదర్శకాలను సూచించారు. ఈ వైద్య శిబిరంలో రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, బిఎంఐ, నాడీ పరీక్షలు వంటి పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్. డాక్టర్ ఎ.రమేష్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ కిషోర్, యూత్ రెడ్ క్రాస్ యూనిట్ కో ఆర్డినేటర్ పి.శివ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని 2, 3, 4 వార్డుల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వార్డు సమస్యల పోరాట కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 3వ వార్డులోని ఆర్‌టిసి కాంప్లెక్స్, శ్రీలక్ష్మీ గణపతి ఆలయం, భాష్యం స్కూల్‌కు వెళ్లే దారి చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతోందన్నారు. వర్షపు నీరు దిగువకు వెళ్లకపోవడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయన్నారు. అంతేకాక 2, 3, 4 వార్డులలో ఇళ్లలోని వాడకం నీరు వెళ్లేందుకు ప్రధాన కాలవ లేదన్నారు. దీంతో నీరు ఇళ్లముందే నిలిచిపోతోందని, మురుగనీరు వెళ్లే కాలువను వజ్రకాలువ వరకూ నిర్మాణం చేపట్టాలన్నారు. వార్డుల్లో పారిశుధ్యం మెరుగు పరచాలన్నారు.